
# రోగమేరా జీవితం

జీడిగుంట నరసింహమూర్తి



**" రెండుగంటల్నుంచి చూస్తున్నాను, మాకు కాఫీ లూ, టిఫిన్లూ ఇచ్చేది ఉందాలేదా ? ఒకటే లొడలొడా వాగుడూ మీరూనూ! అసలు ఎక్కడ చేరినా మీకు ఈ రోగాల గొడవేనా, వేరే ఇంకేం సంగతులు లేవా?" కస్సుమన్నాడు నారాయణరావు.**

•

"చూసావు గదా ఈయనకీమధ్య బీపీ ఎక్కువయింది. చూపించుకోమంటే చూపించుకోరు. జీవితాంతం మందులు వాడాల్సివస్తుందని భయం. ప్రతి చిన్నదానికీ నా మీద రయ్యిమని లేస్తారు" అంది లక్ష్మి భర్త గురించి తోడికోడలికి చెపుతూ.

సెకండ్‌సాటర్‌డే, సండే కలిసొచ్చిందని సుబ్బారావు భార్యా పిల్లల్నేసుకుని దిల్‌షుక్‌నగర్ లోని అన్నగారింటికి వచ్చాడు.

"వీళ్లకందరికీ బీపీయే కదా! ఎవరూ తక్కువ తినలేదు. మీ మరిదితో పోల్చుకుంటే బావగారెంతో నయం. ఈయనకి దేనికి కోపం వస్తుందో, ఎప్పుడొస్తుందో తెలియదు. ఇంట్లో మాట విన్పించకూడదు. టీవీ పెట్టకూడదు.

"కేబుల్ కనెక్షన్ వాడికి నెలనెలా వంద రూపాయలు కడుతున్నాం. ' టీవీ కట్టెయ్యండి కట్టెయ్యండి' అంటూ అరుస్తారు. అయిదు నిముషాలు వంట లేటయితే కాళ్లకింద నిప్పులు పోసేస్తారు. ఆయనికి చిన్నవయసులోనే ముసలితనం వచ్చేసి చాదస్తం ఎక్కువయిపోయింది" అంది జానకి.

ఈలోపు నారాయణరావు తమ్ముణ్ని దొడ్లో వేసిన ఆనప,పొట్ల పాదుల్ని చూపించడానికి తీసుకు వెళ్లాడు. లక్ష్మి- తోడికోడల్ని వంటింట్లోకి తీసుకు వెళ్లింది. డైనింగ్ టేబుల్ మీదున్న నాల్గయిదు చిన్నజాడీలలో ఎర్రగా ఊరగాయలు నూనె కారిపోతూ ఉన్నాయి .

"ఊరగాయలు పెట్టేసారా అప్పుడే?" అడిగింది జానకి.

"ఇవి లేకపోతే మీ బావగారు ముద్దెత్తరు. పచ్చళ్లు చేసుకోని వాళ్లందర్నీ విమర్శిస్తూ ఉంటారు. చెయ్యటమైనా తెలియకపోయుండాలి లేదా టేస్టయినా లేకపోయి ఉండాలంటారు" అంది లక్ష్మి నవ్వుతూ.

"ఇప్పుడు చూస్తే తెలుస్తోంది. మీరు పచ్చళ్లు బాగా తగ్గించాలి. ఇంతింత ఆవకాయ గుండలు వేసుకుంటూంటే బీపీలు రాకుండా ఎలా ఉంటాయీ? పిల్లలక్కూడా ఆవకాయలూ, మాగాయిలూ అలవాటు చేసేసారు. శుభ్రంగా అన్నంలోకి ఉత్తపప్పు వండితే వాళ్లకేనా రోగాలు రాకుండా ఉంటాయి. ఏదిఏమైనా ముందు ఇవి టేబుల్‌మీద నుండి తీసేసి ఎక్కడేనా అందనిచోట పెడితే బద్ధకించి రోజూ వేసుకోకుండా ఉంటారు. ఏమంటావ్ ?" అంది జానకి జాడీలవేపు చూస్తూ.

"మనవాళ్లు నోరసలు కట్టేసుకోలేక పోతున్నారనుకో! అరటిపువ్వుకూర, దూట రెండూ పత్తిపనే! రాత్రెవరేనా ఇటువంటి కూరలు పెట్టుకుంటారా? ఏదో కాసేపు సరదాగా మాట్లాడుకుంటూ ఉన్నామా! ఇప్పుడు నడుం విరగేటట్లు అరటిపువ్వు దూట వలవాలి. అసలు మీ మరిదికే ఈ బుద్ధిపుట్టి ఉంటుంది. " అంది కోపంగా జానకి.

కొద్దిసేపు అరటిపువ్వు వలిచేటప్పటికి లక్ష్మి నడుంనొప్పితో విలవిలలాడిపోయింది. ఆమెకు పదేళ్లనుండి నడుంనొప్పి. డాక్టర్లు అన్ని టెస్టులూ చేసారు. ఆవిడక్కా వలసింది బెడ్ రెస్ట్ . అది ఆ ఇంట్లో దొరకదు. మందులు వేసుకుని కాలక్షేపం చేసేస్తోంది.

జానక్కెప్పుడూ మోకాళ్లు లాగేస్తుంటాయి. ఐదు నిముషాలు కూడా నిలువలేదు. డాక్టర్లు కాల్షియం తక్కువన్నారుట! స్కూల్లో నిలబడి పాఠాలు చెప్పాల్సి వస్తోందని టీచరుద్యోగం కూడా మానేసింది.

లక్ష్మి తల్లితండ్రులు కూడా దిల్‌షుక్‌నగర్ లోనే ఉంటున్నారు. "ఇంత దూరం వచ్చాం గదా మీవాళ్లింటి క్కూడా ఒకసారి వెళ్లొస్తాం " అని జానకి అనడంతో లక్ష్మి కూడా బయలుదేరింది ఆదివారంనాడు.

లక్ష్మి తండ్రి రాజారావుగారు పేపరు చదువుకుంటున్నాడు. ఆయన చుట్టూ మందుల సీసాలున్నాయి. అక్కడి వాతావరణం చూస్తే ఆ ఇంట్లో చిన్న మందుల షాపుందా అన్న అనుమానం

రాకపోదు.

జానకి ఆశ్చర్యపోతూ" ఏమిటి ఇవన్నీ మీకోస మేనా? " అడిగింది.

లక్ష్మి నవ్వుతూ "మా నాన్నగారికి , అమ్మకూ బీ పీ, షుగరు రెండూ ఉన్నాయి. ఈ మధ్య నాన్న గారికి గుండెనొప్పి కూడా వచ్చింది. వాళ్లిద్దరూ మందుల మీదే బతికేది. ఎప్పుడైనా మాలాంటి వాళ్లం కాళ్లు నొప్పులూ తలనొప్పులూ అంటూ ఇక్కడికొస్తుంటాం. మాకు పనికొచ్చే మందులు కూడా ఇక్కడుంటాయి" అంది.

లక్ష్మి తల్లి కమలమ్మ గారికి ఇంతమందిని చూడగానే మొహం చాటయింది. ఆవిడకెప్పుడూ ఎవరోఒకళ్లు మాట్లాడుతూ ఉండాలి. ఆవిడ కూడా వాగుడు కాయే! ఇంటికెవరేనా వస్తుంటే ఆవిడకెంతో బాగుంటుంది. ఆవిడ పక్కనే పెద్ద మంచినీళ్ల బిందె ఉంది. మాత్రలు మింగటం కోసం రోజుకు రెండు బిందెల నీళ్లయినా ఆవిడకు సరిపోవు.

రాజారావుగారు సరదాగా మాట్లాడే మనిషి. ఆయన పొద్దున్నే పేపరు చదువుతాడు. రేడియోలో రంగస్థల పద్యాలు వింటాడు. వార్తలు తప్పనిసరి. ఇంకా తోచకపోతే పెళ్లాంతో ఆవిడ పుట్టింటి గురించి దెప్పుతూ కాలక్షేపం చేస్తూ ఉంటాడు. వచ్చిన వాళ్లందరూ ఆయన గదిలోకి చేరారు. వాళ్ల టాపిక్ డాక్టర్ల మీదా, మందులమీదే!

" చదువయ్యాక డిగ్రీ సర్టిఫికెట్లు పుచ్చుకుని ఉద్యోగం కోసం అడ్డమైన వాళ్లచుట్టూ తిరగాలి. ఒక వయసులో పిల్లలకు సీట్లగురించి స్కూళ్ల చుట్టూ, కాలేజీలచుట్టూ తిరగాలి. ముసలాళ్లయ్యాక ఎక్స్‌రేలు - బ్లడ్ రిపోర్టులూ పట్టుకుని డాక్టర్ల చుట్టూ తిరగాలి. ఈ వలయం నుండి తప్పించు కోవడం ఎవరివల్లా కాదు బాబూ" అన్నాడాయన. ఆయన అన్వయించిన తీరు, హాస్యంగా మాట్లాడి నట్లు అన్పించినా ఎంతో నిజం అన్పించింది.

"మనం గుండె ఆపరేషన్ చేయించుకోవాల్సి వస్తే డబ్బులు బాగా అవసరమవుతాయి. అందుకు ప్రత్యేకం గా కొంత డబ్బు దాచండి అంటూంటుంది మా ఆవిడ ఎప్పట్నించో! రోగాల గురించి ఆవి డెంతగా ఆలోచిస్తోందో చూడండి. "

పూర్వం ఇళ్లలో థర్మామీటరు మాత్రమే ఉండేది. ఇప్పుడు బీపీఆపరేటరు, స్టెతస్కోప్ , షుకర్ చెకింగ్ చేసుకునే పరికరాలు, సెలైన్ పెట్టుకోవడానికి స్టాండు అన్నీ ఇళ్లలోనే అవసరమ వుతున్నాయి. ముందు ముందు ఆపరేషన్ థియేటర్లు ఇంటోనే పెట్టుకున్నా ఆశ్చర్యంలేదు. పేషెంట్లే డాక్టర్లతో రోగాల గురించి మాట్లాడే స్తున్నారు. ఈ మందు వాడమంటారా ఆ మందు వాడమంటారా అంటూ డాక్టర్లనే ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు." అక్కడున్న వాళ్లంతా ప్రేక్షకులుగా మారిపోయారు తప్ప మాట్లాడే వాళ్లెవరూ లేరు ఒక్క రాజారావు గారు తప్ప .

"మీకెంతమంది పిల్లలు , ఎంత ఆస్తి ఉందనేది ఎవరూ అడగటం లేదు. మీకెన్ని రోగాలున్నాయి? ఎంత ఖర్చుపెట్టారు? మీ డాక్టరెవరు?" అని అడుగుతున్నారు. నా జీవితంలో ఎప్పుడూ తల నొప్పి కూడా ఎరుగను అన్నవాళ్లు కూడా మరుక్షణంలో మేజరాపరేషన్‌కు వెళ్తున్న పరిస్థితులు ఎన్నో ఉన్నాయి. హాస్పిటల్స్ చూస్తుంటే తెలుస్తుంది ప్రపంచంలో ఎంతమంది రోగులున్నారో! "

" రాగాలతో రోగాలను తగ్గిస్తామని కొందరు, ఆయుర్వేదం అని కొందరు, ఆకువైద్యం అంటూ ఇంకొకరు ఆశలు కల్పిస్తూ ఉంటే రోగులు ఇందులోంచి అందులోకి, అందులోంచి ఇందులోకి దూకుతూ రోగాన్ని ఇంకా ముదరబెట్టుకుంటూ, మనశ్శాంతి లేక సతమతమవుతున్నారు.

"ఇంకొందరు రోగులు డాక్టర్లను చూడటానికి భయం వేసి , డాక్టర్ల సలహాలను పత్రికల్లో చదివేసి సొంతవైద్యం చేసుకుంటూ ప్రాణంమీదకు తెచ్చు కుం టున్నారు. అనకూడదు కానీ డాక్టర్లకూ అలాగే ఉంది. ఒక డాక్టరు రాసిన మందులు ఇంకొక డాక్ట రు రాయడు. ఆ రోగానికి ఒకే మందుందని తెల్సినా కనీసం కంపెనీ అయినా మార్చిరాస్తాడు. మానవజీవితం అనేక రకాలుగా చాలా మందికి ఎక్స్‌పరిమెంట్ చెయ్యడానికి ఉపయోగపడుతోంది. ఆఖరికి ఈ శరీరం మందులు నూరుకునే కల్వంలా తయారయ్యింది. "

ఆయన చెప్పుకుంటూ పోతున్నాడు. మధ్యలో రెండుమూడు రకాల మాత్రలు కూడా మింగాడు. " చివరగా చెప్పేదేమిటంటే ఏమనిషిని కదిపినా కందిరీగల పుట్టలాగా రోగాల గురించే మాటాడ తాడు. మనకున్న రోగాల గురించి మనం పెద్దగా మనస్తాపం చెందనవసరం లేదు. లోకంలో ఎంతోమంది భయంకరమైన రోగాలతో బాధ పడ్తున్నారు. వాళ్లతో పోల్చుకుంటే మనం ఎంతో హాయిగా జీవిస్తున్నట్టే లెక్క...!"

రాజారావుగారు చెప్పేదాంట్లో ఎంతో నిజం ఉందనిపిస్తుంది. తాము వీళ్లింట్లో కాసేపు సరదాగా గడపాలని వచ్చారు. కాని ఇక్కడా రోగాల గురించే సంభాషణ . ... శనివారం , ఆదివారం ఏఆనందం లేకుండా గడిచిపోయినట్లనిపించింది. సుబ్బారావు కుటుంబానికీ, నారాయణరావు కుటుంబానికీనూ.

నాలుగడుగులు నడుచుకుంటూ అందరూ నారాయణ రావింటికి చేరుకున్నారు. అక్కడ సుబ్బా రావుగారి కోసం ఒక మెసేజీ రెడీగా ఉంది. జానకి తండ్రిగారికి సడెన్‌గా గుండెనొప్పి వచ్చి హాస్పిటల్లో చేర్చారట! అర్జెంటుగా రక్తం అవసరం వచ్చిందిట. నేరుగా ఆ హాస్పిటల్ కొచ్చేయమని వార్త. సుబ్బా రావు గుండెపట్టుకున్నాడు అయోమయంగా.

Ⓟ


## పెళ్ళి సంబంధములు

అన్ని కులముల, మతములు, డాక్టర్లు, ఇంజనీర్లు, ప్రభుత్వోద్యోగులు, వ్యాపార పారిశ్రామికవేత్తలు, దేశ, విదేశ మేలైన పెళ్ళి సంబంధాలకై సంప్రదిం చండి.

**కృష్ణవేణి కళ్యాణ వేదిక**
పోస్టాఫీసు దగ్గర
భరత్‌నగర్ కాలనీ—హైదరాబాద్—18
ఫోన్ నెంబరు: 3713894

గమనిక: వితంతువులు, విడాకులు పొందిన వారు ద్వితీయ వివాహము కొరకై సంప్రదించ వచ్చును.

శుక్రవారం—శెలవు
పని వేళలు:10.00 A.M. To 7.00 P.M